ఎడతెరిపి లేని వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నాగాయలంకలో అత్యధికంగా 72.2 మి.మీ వర్షపాతం
- బందరులో 56.20 మి.మీ వర్షపాతం



పెడన పట్టణంలోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు

అవనిగడ్డ: బందరు, అవనిగడ్డ, పెడన నియోజక వర్గాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దివిసీమలో ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షం సోమవారం ఉదయం వరకూ కొనసాగింది. ఎడతెరిపిలేని జల్లులతో పలు పల్లపు ప్రాంతాలు జలమయ మయ్యాయి. నియోజకవర్గంలో నాగాయలంకలో అత్యధికంగా 72.2 మి.మీ, ఘంటసాలలో 59.6, అవనిగడ్డలో 55.6, చల్లపల్లిలో 51.6, కోడూరులో 44.4, మోపిదేవిలో 41.2 మి.మీ వర్షపాతం నమోదైంది. నారుమడులు పోసుకునేందుకు సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో నారుమళ్ల పనులు ఊపందుకున్నాయి. రెండు రోజుల క్రితం పోసిన నారుమళ్లు అక్కడక్కడా పోగులు పడినట్టు రైతులు చెప్పారు. కొన్నిచోట్ల నీట మునిగిన నారుమళ్ల నుంచి నీటిని రైతులు తోడారు.

బందరులో..

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షం రాత్రి అంతా కురుస్తూనే ఉంది. సోమవారం ఉదయం 8 గంటల సమయానికి నగరంలో 56.20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పగటిపూట కూడా వాన పడుతూనే ఉంది.

పెడనలో..

పెడన: మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కచ్చా డ్రైన్లలో నీరు రోడ్డుపైకి చేరింది. పట్టణ పరిధిలోని రామలక్ష్మీవీవర్సు కాలనీ, బలిపర్రు సమీపంలోని వైఎస్సార్ కాలనీ వాసులు వర్షం నీటితో ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలోని పంట పొలాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో వెద సాగు చేసిన రైతులు తమ పంట దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వానకు పొలాలు నీట మునగడంతోపాటు పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదకయ్యలుగా మారాయి. అధికారులు తెలిపిన సమాచారం మేరకు రెండు రోజులుగా కురిసిన వర్షం దాదాపు 12 సెం.మీ. నమోదైంది. పెదతుమ్మిడి, నాగేశ్వరరావుపేట, బందకోడు, చినతుమ్మిడి, మల్లపరాజుగూడెం, పెందుర్రు గ్రామాల పరిధిలోని మైనర్, మీడియం డ్రెయిన్లు పొంగి పొర్లుతున్నాయి. పెందుర్రు గ్రామ పరిధిలోని 216 జాతీయ రహదారి మీద మురుగు నీరు సమీపంలోని మంచినీటి చెరువులోకి చేరి కలుషితం చేస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ మాదాసు లక్ష్మీశకుంతల ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పెడన ఎమ్మెల్యే, మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు మార్జిన్‌లో డ్రైన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.







చెన్నూరు గ్రామంలో నీటి మునిగిన పంట పొలాలు ; కోడూరు మండలం పిట్టల్లంకలో నారుమడి కోసం కరపట్టె లాగుతున్న రైతు ; బందరు బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన వాన నీరు

నీటమునిగిన వరి చేలు



కృత్తివెన్ను మండలం సంగమూడి వద్ద నీటమునిగిన వరిచేను

కృత్తివెన్ను: 216 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సంబంధిత యంత్రాంగం చూపిన అశ్రద్ధ, నిర్లక్ష్యం కారణంగా నేడు తమ పొలాలు ముంపుబారిన పడి పాడయ్యాయని యండపల్లి సర్పంచ్ ప్రభుప్రసాద్‌తో పాటు రైతులు విశ్వేశ్వరరావు, గంగరాజు, పూర్ణచంద్రరావు తదితరులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి నుంచి కృత్తివెన్ను మండలంలో భారీ వర్షం కురిసింది. దీని కారణంగా లోతట్టు ప్రాంతాలతో పాటు, నాట్లు వేసిన వరిచేలు పూర్తిగా నీటమునిగిపోయాయి. యండపల్లి గ్రామంలో జాతీయరహదారి నిర్మాణసమయంలో సంబంధిత అధికారులు డ్రైన్‌ను పూడ్చివేశారన్నారు. పనులు పూర్తయిన తర్వాత తిరిగి డ్రైన్ నిర్మించకుండా వదిలేయడంతో ఇప్పుడు వర్షం నీరు పంట పొలాల్లోకి చేరాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వాసుపత్రికి కుట్టుమిషన్ వితరణ



మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆసుపత్రికి హెడ్‌నర్సు దాసరి స్వర్ణలత సోమవారం కుట్టుమిషన్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్‌లో దుస్తులు కుట్టడానికి కుట్టుమిషన్ లేక అక్కడి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని వీటిని తీర్చడానికి కుట్టుమిషన్ అందించడం సంతోషంగా ఉందన్నారు. స్వర్ణలతను ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డి.ఆశాలత, వైద్యులు శ్రీనివాసరావు, నిరంజన్ తదితరులు అభినందించారు.

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం



గుడివాడరూరల్: తల్లిదండ్రులను చిన్నతనం నుంచే గౌరవించడం మన సంప్రదాయమని పలువురు ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక శారద వికాస్ స్కూల్‌లో సోమవారం తల్లిదండ్రుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత చిన్నారులతో తల్లులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించి పూజించాలని కోరారు. క్లబ్ ఫౌండర్ అధ్యక్షుడు లోయాశ్వర వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఆర్జా ప్రసాద్, మెరుగుమాల శివరామకృష్ణ, ట్రస్ట్ చైర్మన్ లింగం చిట్టిబాబు, సభ్యులు రూప్‌చంద్ జైన్, జ్ఞాన్ చంద్‌జైన్, జుజ్జవరపు వెంకటేశ్వరరావు, కొమరోలు రామకృష్ణ, పొన్నూరు సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెన్షనర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: నగరంలోని 38వ డివిజన్‌లో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ పింఛన్ లబ్ధిదారు కొత్త రాజకుమారి కుటుంబానికి తోటి పింఛనర్లు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. డివిజన్‌లోని పెన్షనర్లు తలో రూ. 100 అందజేయగా వచ్చిన రూ. 20 వేలను రాజకుమారి కుమార్తె గంగావిష్ణుకుమారికి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహ గుప్తా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణితో కలిసి అందజేశారు. గతంలో డివిజన్‌లో మృతి చెందిన వారికి రాజకుమారి రూ. 100 చొప్పున ఇస్తూ ఉండేదని, ఆమె ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో తాము సాయం అందించామని పెన్షనర్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్ వేముల కృష్ణ, జల్లూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



గూడూరు: మండలంలో కలపటం ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచి బనాల దేవనాగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పలకలు, కాపీ రైటింగ్ పుస్తకాలను సర్పంచి సొంత నిధులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాలువల్లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోండి

గూడూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు ముంపు బారిన పడకుండా మురుగు కాలువల్లో నీరు ప్రవహించడానికి చర్యలు తీసుకోవాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు డ్రెయినేజీ విభాగ అధికారులను కోరారు. తుమ్మలపాలెం ప్రాంతంలో సోమవారం లజ్జబండ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులను పెనుమల్లి సర్పంచి గరికపాటి రామానాయుడుతో కలిసి ఎంపీపీ పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ కాలువల్లో గుర్రపుడెక్క, తూడు తొలగింపు విషయంలో అశ్రద్ధతో ఉంటే పొలాలు ముంపు బారిన పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఉదాసీనంగా ఉండొద్దని కోరారు. కార్యక్రమంలో డీఈ మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఘనస్వాగతం



మచిలీపట్నంటౌన్: పవిత్ర హజ్ (మక్కా) యాత్రను ముగించుకుని తిరిగి వచ్చిన యాత్రికులకు హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌసల్‌ఆజం, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా ఆదివారం రాత్రి ఘన స్వాగతం పలికారు. 6వ విమానంలో వచ్చిన 174 మంది హజ్ యాత్రికులకు వీరు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యాత్రికులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుందని దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం తీసుకోని ప్రత్యేక శ్రద్ధ సీఎం జగన్ మోహన్‌రెడ్డి చూపుతున్నారని కొనియాడారు. యాత్రికులకు గౌసల్ ఆజం, సలార్‌దాదా హమేజంజం వాటర్‌ను అందజేశారు.

హుండీ కానుకల లెక్కింపు

గుడ్లవల్లేరు(గుడివాడరూరల్): గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో శ్రీకొండాలమ్మ అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 63రోజులకుగాను భక్తులు సమర్పించిన కానుకలు నోట్ల రూపంలో రూ.30,03,925, చిల్లర రూపేణా రూ.1,56,118 మొత్తం రూ.31,60,043 వచ్చాయి. 79 గ్రాముల బంగారం, 3.050 గ్రాముల వెండిని భక్తులు అమ్మవారికి కానుకలుగా సమర్పించారు. కార్యక్రమంలో పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయ ఈవో కేవీ గోపాలరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి, ఆలయ ఈవో కానూరి సురేష్‌బాబు, ఆలయ పాలక వర్గ సభ్యులు పామర్తి వెంకటస్వామి, కొమ్మన బోయిన రవిశంకర్, వల్లూరు వెంకటరావు, బాడిగ లీలసౌజన్య, నారేపాలెం వెంకటనిర్మల, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జనరంజక పాలన జగన్‌తో సాధ్యం

పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: రాష్ట్రంలో జనరంజక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్య పడుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు అన్నారు. మండలంలోని సుల్తానగరం, గరాలదిబ్బ గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు.

సుల్తానగరంలో కిట్టు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎలాంటి పని కావాలన్నా కిలోమీటర్ల దూరంలో ఉండే పట్టణాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజల వద్దకే పాలన అమలు చేస్తున్నారన్నారు. సుల్తానగరంలో 252 ధ్రువీకరణ పత్రాలను కిట్టు అర్జీదారులకు అందజేశారు. గరాలదిబ్బ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వివిధ రకాల 52 ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీఓ బాలకృష్ణారావు అందజేశారు. సుల్తానగరంలో జరిగిన కార్యక్రమాల్లో బందరు తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ సుల్తానగరం ఇన్‌చార్జ్ మట్టా వెంకటేశ్వరరావు, మట్టా రాందాస్, గరాలదిబ్బలో కార్యక్రమంలో గ్రామ ఇన్‌చార్జ్ ఒడుగు వెంకటనారాయణ, తిరుమలశెట్టి నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



వేకనూరులో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, ప్రజాప్రతినిధులు



సుల్తానగరంలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న పేర్ని కిట్టు

వేకనూరులో 775 సర్టిఫికెట్లు అందజేత

వేకనూరు(అవనిగడ్డ): వేకనూరులో సోమవారం జగనన్న సురక్ష జరిగింది. స్థానిక సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న 775 మందికి పలు రకాల సర్టిఫికెట్లను ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వేకనూరు, తుంగలవారిపాలెం సర్పంచ్‌లు తుంగల లక్ష్మి, తుంగల వాసుదేవరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, గ్రామ కన్వీనర్ తుంగల వేణు తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మీయ కలయిక



గుంటూరు జిల్లా అమరావతిలోని కృష్ణాయపాలెంలో సోమవారం జరిగిన పేదల ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గుర్రం జాషువాకు ఘన నివాళి



పామర్రు: స్థానిక శివరామ సినీకాంప్లెక్సులో గుర్రం జాషువా వర్ధంతి సోమవారం నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఆవుల ప్రవీణ్ మాట్లాడుతూ తెలుగు ప్రజల మనస్సులో నిలిచి పోయిన కవి, సంఘ సంస్కర్త, దోపిడీ వర్గాలపై తిరుగుబాటు చేసిన వ్యక్తి జాషువా అన్నారు. చీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలను పొందారని తెలపారు. కళా ప్రపూర్ణ, నవయుగ చక్రవర్తి అనే బిరుదులు పొందారని కొనియాడారు. ఆయన మరణించినా ఆయన రచనలు ప్రజల మనస్సులో చిర స్థాయిగా నిలిచిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన హక్కుల పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, నాయకులు జువ్వనపూడి సురేంద్ర, నత్తా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి



వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అయ్యంకి మురళీకృష్ణ, గ్రామస్తులు

అయ్యంకి (మొవ్వ): గ్రంథాలయాల మనుగడకు అయ్యంకి వెంకట రమణయ్య చేసిన ఉద్యమ ఫలితంగా నేడు వేలాది మంది గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నారని, ఇంతటి మహానుభావుడు తమ గ్రామంలో జన్మించడం గర్వకారణమని మొవ్వ జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి వేడుకలను ఆయన స్వగ్రామం అయ్యంకి పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణయ్య చిత్రపటానికి జెడ్పీటీసీ పార్వతి, సర్పంచి నాగనబోయిన సునీల్, రమణయ్య మనువడు అయ్యంకి మురళీకృష్ణతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మురళీకృష్ణ గ్రామంలో వలంటీర్ల వినియోగార్థం 20 బయోమెట్రిక్ మిషన్లు, ప్రధాన రహదారిపై నాలుగు సీసీ కెమెరాల ఏర్పాటుకు నగదు అందజేశారు. జెడ్పీటీసీ, సర్పంచి, ఉప సర్పంచి రాజులపాటి సుబ్బారావు, గ్రేడ్-1 ఈవో వక్కలగడ్డ నరసింహారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అయ్యంకి మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు.

జమీగొల్వేపల్లి(పామర్రు): గ్రంథాలయ వ్యవస్థకు ఆద్యుడు అయ్యంకి వెంకట రమణయ్య అని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండల పరిధిలోని జమీగొల్వేపల్లి గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో వెంకట రమణయ్య జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన వకృత్వ పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. స్థానిక జెడ్పీపాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రామయ్య, గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మోపిదేవి వార్పు వద్ద ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మోపిదేవివార్పు(మోపిదేవి): ప్రాజెక్టుల రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ దొరని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి వార్పు వద్ద కాటన్ దొర వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ప్రాజెక్టులు నిర్మించి వృథాగా సముద్రం పాలవుతున్న నీటిని వడిసిపట్టి సాగు, తాగునీరు అందించి ప్రజల దాహార్తిని తీర్చిన మహనీయుడు కాటన్ దొర అన్నారు. ఈ ఏడాది దివిసీమలో ఆయకట్టు చివరి వరకు సాగు నీరు అందించి సస్యశ్యామలం చేయాలని సూచించారు. అధికారులు సకాలంలో సాగునీరు అందించి పంటలు బాగా పండటానికి సహకరించాలని కోరారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. మత్తి వెంకట రాజాచంద్, మత్తి రాంప్రసాద్, నందిగం అభిషేకరావు, పాలిమెట్ల వెంకటేశ్వరావు, జలవనరుల శాఖ అధికారులు డీఈఈ ఆర్ రవికిరణ్, చల్లపల్లి ఏఈఈ కెఎస్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన వారికి వైద్య సేవలు అందించండి

కలెక్టర్ రాజాబాబు



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో పాముకాటు గురైన వారికి వైద్యసేవలు అందించాలని కలెక్టర్ రాజాబాబు వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. ఆయన జిల్లా, క్షేత్రస్థాయి అధికారులతో సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కువగా పాములు సంచరించే అవకాశం ఉందన్నారు. పాముకాటుకు గురైన వారు ఎవరూ కూడా చనిపోకుండా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో, పీహెచ్‌సీల్లో ఫ్యామిలీ డాక్టర్ వద్ద పాముకాటు మందు అందుబాటులో ఉంచాలన్నారు. అవనిగడ్డ, సముద్రతీర ప్రాంతాలు, మడ అడవులు ఉన్న ప్రాంతాల్లో పాముకాటు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై క్రైస్తవ సంఘ పాస్టర్ల ఆగ్రహం

31న మచిలీపట్నంలో భారీ ర్యాలీకి నిర్ణయం

మచిలీపట్నంటౌన్: మతతత్వ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమికి వచ్చే ఎన్నికల్లో క్రైస్తవులు తగిన బుద్ధి చెబుతారని పాస్టర్లు హెచ్చరించారు. సోమవారం మచిలీపట్నంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనలను ఖండిస్తూ సమావేశం నిర్వహించారు. మణిపూర్ ఘటనకు నిరసనగా ఈ నెల 31వ తేదీన మచిలీపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. కోనేరుసెంటరు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి మార్గం మధ్యలో ఎంపీ, ఎమ్మెల్యేలకు, కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో ఆల్ ఇండియా క్రిష్టియన్ కౌన్సిల్ అండ్ ఫెడరేషన్ మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు మేకా విజయరాజు, బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్‌పాల్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి



చల్లపల్లి: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య సంఘ కార్యాలయంలో సోమవారం చల్లపల్లి శ్రీ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. సంఘం నూతన అధ్యక్షులుగా అన్నవరపు పాండు రంగారావు, కార్యదర్శిగా వరదా హరిగోపాల్, ఉపాధ్యక్షులుగా కొల్లిపర సాంబశివరావు, సంయుక్త కార్యదర్శిగా కొల్లిపర సురేంద్ర, ట్రెజరర్‌గా తమ్మన సతీష్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

అనంతరం ఐఐటీ, జేఈఈ మెయిన్స్, టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. ఇటీవల తమిళనాడులో ఏషియా వేదిక్ కల్చర్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న కొల్లూరి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. సంఘ పెద్దలు జల్లూరి ప్రసాద్, వరదా తాండవకృష్ణ, కొల్లిపర మధు, మెహెర్ వి.శ్రీనివాస్, జూపూడి సాయిబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.